కథ

# శిక్ష

ఆర్.శ్యామల

"కమలా!" పిలిచాడతను.

ఏమిటన్నట్లు చూసింది.

"ఫంక్షన్‌కి నువ్వూ రాకూడదూ" ఈ మాట చెప్పడానికి రెండు రోజులు తర్జన భర్జన పడ్డాడు. "పిల్లలు వస్తున్నారు. నువ్వూ వస్తే బాగుంటుంది"

ఆశ్చర్యంగా చూసిందతని వైపు.

"మమ్మీనా! వద్దుడాడీ! మమ్మీకి ఏం తెలియదు. మేం వస్తున్నాం కదా. అదీ కాక మమ్మీకి చిన్న వర్కుంది" అంటూ మేఘన, "మీ అల్లుడు, ఇంకో ఇద్దరు ఫ్రెండ్స్ లంచ్‌కి ఇక్కడికి వస్తున్నారు. లంచ్ ఏర్పాట్లు చూడు మమ్మీ!" అతనికి ఏం ఇష్టమో, ఏమేం వండాలో లిస్ట్ చెప్పుకుపోతోంది.

మౌనంగా వింటోంది కమల.

మొదటిసారిగా మనస్సు చివుక్కుమనిపించిందతనికి.

ఈరోజు తను రిటైర్ అవుతున్నాడు. ఆఫీసులో తనతోపాటు మరో ఇద్దరు కూడా రిటైర్‌మెంట్ అవుతున్నారు. ముగ్గురికి కలిపి కంపెనీ సన్మానం ఏర్పాటు చేసింది. కంపెనీ వాళ్ళు, భార్యాభర్తలిద్దరికీ కలిపి సన్మానం చెయ్యడం ఆనవాయితీ. మిగిలిన ఇద్దరూ వాళ్ళ భార్యలతో వస్తారు. ముందు వద్దనుకున్నా, తర్వాత ఎలాగో డిసైడ్ అయి కమలని రమ్మన్నాడు. కానీ ఆమె జవాబు చెప్పేలోగే కూతురు చాలా పన్లు అప్పజెప్పేసింది.

అతనికి మొదటిసారి కూతురుమీద కోపం వచ్చింది. కొడుకు, కోడలు, మనవలు అందరూ వచ్చారు. అందరూ సుమోలో కంపెనీకి వెళ్ళారు. ముగ్గురి ఆఫీసర్స్ రిటైర్‌మెంట్ ఒక్కరోజే కావడంతో భారీగా ఏర్పాట్లు చేసారు. ముగ్గురిని స్టేజీమీదకి ఆహ్వానించారు. మిగిలిన ఇద్దరూ వాళ్ళ భార్యలతో స్టేజి మీదకి వచ్చారు. కొంతమంది అతన్ని అడిగారు. "సార్! మేడమ్‌గారు రాలేదా!" అని. "మమ్మీకి ఫీవర్" అని టక్కున జవాబు చెప్పింది మేఘన.

స్టేజిపైన పెద్ద పెద్ద పూలదండలు తెచ్చి భార్యాభర్తలకు కలిపివేసారు. ఇద్దరికి కలిపి కాశ్మీర్ షాలువా కప్పారు. కంపెనీ తరఫున భార్య, భర్తలిద్దరికీ బంగారు ఉంగరాలు ఇచ్చి, ఒకళ్ళకి ఒకరు తొడిగించారు. అతనికి కమలలేని వెలితి మొదటిసారిగా బాధించింది. కమల స్థానమేమిటో, ఆమె విలువ ఏమిటో మొదటిసారిగా తెలిసి వచ్చిందతనికి. మొత్తానికి కంపెనీవాళ్ళు రిటైర్‌మెంట్‌తో పాటు షష్టిపూర్తి కూడా గ్రాండ్‌గా చేసారు.

తిరిగి వస్తున్నప్పుడు కమల గురించే ఆలోచిస్తున్నాడు. ఏం మనిషి తను, ఎప్పుడూ ఏదీ కావాలని అడగదు. తన పని తాను చేసుకుపోతుంది.

మౌనంగా ఏదో ఆలోచిస్తున్న అతన్ని చూసి "డాడీ! రిటైర్ అయ్యారని బాధపడుతున్నారా! టేకిట్ ఈజీ డాడ్!" తండ్రి భుజాల మీద తలవాల్చింది మేఘన.

ఆప్యాయంగా కూతురు తల నిమిరాడు.

"డాడ్! మీకిచ్చిన రింగ్స్ ఏవి?"

జేబులోంచి తీసి ఇచ్చాడు.

"అన్నయ్యా! ఈ రింగ్ నేను తీసుకుంటున్నాను. ఇది నువ్వు తీసుకో" అని ఒకటి తను తీసుకొని రెండో ఉంగరం ప్రశాంత్‌కి ఇచ్చేసింది.

ఇబ్బందిగా నవ్వాడతను. ఆ ఉంగరం ఇంటికి తీసుకువెళ్ళి, కమలకి ఇద్దామనుకున్నాడు. కాని, ఇక్కడే పిల్లలిద్దరూ వాటాలు వేసుకున్నారు. శాలువా కూడా బాగుందని కూతురే తీసుకుంది.

ఇంటికి వచ్చేసరికి అల్లుడు, తన ఇద్దరి ఫ్రెండ్స్‌తో హాల్లో ఉన్నారు. జోక్స్ వేసుకుంటూ చాలా సంతోషంగా ఉన్నారందరూ. ఇల్లంతా కోలాహలంగా ఉంది.

అతని కళ్ళు కమలని వెతుకుతున్నాయి. అక్కడి నుండి లేచి వంటింట్లోకి వెళ్ళాడు. "ఎంత నీట్‌గా ఉంది వంటిల్లు" మనసులో కమలని మెచ్చుకున్నాడు.

అతని రాకని గమనించి, ఉలిక్కిపడి చూసింది. గాభరాగా "ఆ..వంట అయిపోయింది. అన్నీ టేబుల్ మీద సర్దేస్తాను. పిల్లలతో చెప్పండి" అని మళ్ళా తన పనిలో పడింది.

'ఫ..ఫంక్షన్ ఎలా అయిందని కూడా అడగలేదు' మనసులో అనుకున్నాడతను.

వెనుతిరిగి వెళుతున్న అతనివైపు కమల చూస్తూ ఉండిపోయింది.

ఫంక్షన్ కోసం కమల ఏం అడగలేదు. కూతురు, కొడుకూ కూడా ఏం చెప్పలేదు. కోడలే అంది. "ఫంక్షన్ బాగా జరిగిందాంటీ! మీరు మిస్ అయ్యారు.." అని.

నవ్వి వూరుకుంది కమల.

భోజనాల దగ్గర "వాహ్ ఎంత బాగుంది. మీ చేతిలో అమృతం ఉందాంటీ!" అని అల్లుడు, అతని ఫ్రెండ్స్ పొగుడుతుంటే మేఘన అనీజీగా ఫీలయ్యింది. కమల మాత్రం చిన్న చిరునవ్వు నవ్వింది.

'నిజమే...! కమల చాలా బాగా వంట చేస్తుంది. కాని తాను, పిల్లలు ఏనాడూ ఇలా ఆమెని మెచ్చుకోలేదు.'

అందరూ తృప్తిగా భోజనం చేసారు. కాని, అతనొక్కడే సరిగ్గా భోజనం చేయలేకపోయాడు.

అందరి భోజనాలయాక కమల ఒంటరిగా కూర్చుని వడ్డించుకుంది.

మేఘన, ప్రశాంత్ అతని రిటైర్‌మెంట్ మనీలో తమ వాటా ఎంతో తెలుసుకొని, మిగిలింది ఎందులో, ఎలా ఇన్వెస్ట్ చెయ్యాలో అతనికి చెప్పారు. అన్నీ నిర్ణయించుకున్నాక ఆ సాయంత్రమే కూతురు, అల్లుడు వెళ్ళిపోయారు. రాత్రి భోజనాలు చేసి కొడుకు, కోడలు, మనుమలు వెళ్ళిపోయారు. ఇల్లంతా ప్రశాంతంగా ఉంది. అతనికి ఆ రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు.

'ఇన్నాళ్ళు కమలని సరిగ్గా పట్టించుకోలేదు. రేపటి నుండి కమలని సంతోషంగా ఉంచుతాను' మనసులో అనుకున్నాడు.

ఎప్పటిలా ఉదయం ఆరు గంటలకు అలారం మోత విన్పించింది. అలారం ఆఫ్‌చేసాడు. ప్రక్కనే బెడ్ కాఫీ. కమల తన అలవాటు ప్రకారం టైముకి అన్నీ చేస్తుంది.

"కమలా..." అని పిలవబోయి కాఫీ కప్పు ప్రక్కనే ఉన్న లెటర్‌పై దృష్టిపడింది. తెల్లని పేపర్‌లో అందమైన దస్తూరి. 'ఎవరిదా' అని సంతకం చూసాడు. 'కమల' అని ఉంది.

'కమలది ఇంత అందమైన దస్తూరా! ఇన్నాళ్ళు తెలియదే' మనసులో అనుకుని అయినా నాకు ఏమి రాసింది అని ఒకింత ఆశ్చర్యంగా చదవసాగాడు.

"క్షమించండి. మిమ్మల్ని ఏమని పిలవాలో తెలియదు. భర్తగా మిమ్మల్ని సంబోధించలేను. ఎందుకంటే మీరు ఏనాడూ నన్ను భార్యగా చూడలేదు గనుక.

ముప్పై సంవత్సరాల క్రితం ఇష్టపడి పేదింటి అమ్మాయినైనా నాకు తాళికట్టారు. నాటి నుండి నన్ను నా పుట్టింటి నుండి వేరు చేసి ఈ బంగారు పంజరంలో

బంధించారు. మీ స్టేటస్‌కి తగినట్లుగా మా వాళ్ళు ఎదగ లేదని వాళ్ళతో బంధాలు తెంచుకున్నారు. తల్లి, తండ్రీ అనీ తమ్ముల ప్రేమకు నన్ను కర్కశంగా దూరం చేసారు. మీకు కావలసింది భార్య కాదు. ఒక అందమైన బొమ్మ



మాత్రమే. అవసరాలు తీర్చే బొమ్మ. పెళ్ళైయిన రోజు నుండి చూస్తున్నాను. మీరు అహంకారంతో నన్ను ఒక పనిమనిషిగా చూసారు తప్ప, భార్యగా ఏనాడూ గుర్తించ లేదు.

ఏదన్నా మాట్లాడాలన్నా, చెప్పాలన్నా "నువ్ నోర్మూయ్, నీకేం తెలియదు నువ్ మాట్లాడకు" ఇలా రోజుకి ఎన్నిసార్లో మీ గద్దింపులు. పిల్లలు పుట్టాక అయినా నా జీవితం బాగుంటుందని ఆశపడ్డాను. పిల్లలని కంటికి రెప్పలా కాపాడుకున్నా, మీరు వాళ్ళని కూడా నా నుంచి దూరం చేసారు. అంతవరకు మీ ఒక్కరి మాటలు భరిస్తూ వచ్చిన నేను తర్వాత మీ పిల్లలతో కూడా మాటలు పడేదాన్ని. ఏది కావాలన్నా, హక్కు ఉన్నట్లు అధికారికంగా అడిగి చేయించుకున్న మీరు, నేను నోరు తెరవబోతే "మాట్లాడకు నీకేం తెలియదు, నీ. మొఖానికి అంత సీన్ లేదులే" అని పిల్లలముందే చులకన చేసారు. ఇంక పిల్లలు కూడా "నీకేం తెలియదు మమ్మీ!" అంటూ నన్ను పూర్తిగా విస్మరించారు. వాళ్ళకి మీరే కావాలి. వాళ్ళకేం కావాలో, ఏం కొనాలో, ఏం చదువులు చదవాలో అన్నీ మీరే నిర్ణయించేసారు. ఆఖరికి పెళ్ళిళ్ళు కూడా మీరంతా కలిసి నిర్ణయించుకున్నాక కాని, నాకు చెప్పలేదు. మీకెప్పుడూ మీ పిల్లలు, ఫ్రెండ్సూ, ఆఫీస్ తప్ప ఇంట్లో నేనున్నానని, నాకో మనసుందని ఎందుకు అర్థం చేసుకో లేదు. నీకేమైనా తక్కువ చేసానా? అని మీ డొటు కాబోలు. నేను పెట్టుకున్న బొట్టు దగ్గర నుండి, కాళ్ళపట్టీల వరకు అన్నీ మీకు నచ్చి, మీరు తెచ్చినవే. నా ఇష్టమేంటో, నాకేం కావాలో ఏనాడూ తెలుసుకోవాలని ప్రయత్నించలేదు. అందమైన భార్య కావాలని కోరుకోవడం తప్పు కాదు. కాని, ఇలా ముప్ఫై ఏళ్ళుగా గృహనిర్బంధంలో ఉంచానని మీకేనాడైనా తలంపు వచ్చిందా? పిల్లలు, మీరు, విందులు వినోదాలు, సిన్మాలతో ఎంజాయ్ చేసేవారు. పేదింటిదాన్నని, నాకు కల్చర్ ఏమీ తెలియదని నన్ను దూరంగా వుంచారు. కాదు, దూరం చేసుకున్నారు.

కాని, రెండు రోజులుగా మిమ్మల్ని గమనిస్తున్నాను. నాతో మాట్లాడాలని ఆరాటపడుతున్నారు. రిటైర్ అయిన మీరు మునుపటిలా ఎక్కువసేపు బయిట గడపలేరు. ఇంట్లో మీకో తోడు కావాలి. మీతో మాట్లాడే వారు కావాలి. ఇన్నాళ్ళూ నా నోరు మూయించిన మీరు ఇప్పుడు నా నోరు తెరిపించాలని చూస్తున్నారు. కానీ ఇన్నేళ్ళు మూగబోయిన నా గొంతు పెగులుతుందా? మీలో శక్తి వున్నంతవరకూ విర్రవీగి, అహంకారంతో నన్ను అణచి వేసారు. నేడు మీ శక్తి సన్నగిల్లేసరికి తోడు కోసం తహతహలాడుతున్నారు. మీరు నాకు చేసిన అన్యాయాలకు క్షమించే శక్తి నాకు లేదు. నా జీవితాన్ని నాకు కాకుండా చేసి, నా ఆశలన్నింటినీ కాలరాసి, నా బ్రతుకుపై వికటాట్టహాసం చేసిన మీకు ఈ వృద్ధాప్యంలో 'నా మౌనమే నేను మీకు విధించే శిక్ష' నేను బ్రతికి వున్నంతవరకు మీ పనులన్నీ యధావిధిగానే జరుగుతాయి. కానీ, దయచేసి నాతో మాట్లాడవద్దు. మాట్లాడించవద్దు.

ఇట్లు

కమల.

ఉత్తరం చదివిన అతనికి చెంప ఛెళ్ళుమన్నట్లయింది.